క్లుప్తంగా

సైడ్‌కాల్వల నిర్మాణానికి భూమిపూజ



అమరావతి: మండల పరిధిలోని వైకుంఠపురంలో బుధవారం ఎస్సీ కాలనీలో సైడ్‌కాల్వల నిర్మాణానికి ఎమ్మెల్యే నంబూరు శంకరరావు భూమిపూజ చేశారు. ఎస్సీకాలనీలో పీఎంఏజీవై పథకం కింద రూ.20లక్షలతో సైడ్ కాల్వలు నిర్మాణానికి ఎమ్మెల్యే శంకరరావు కొబ్బరి కాయకొట్టి పూజలు చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా పనులు త్వరగా పూర్తిచేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. వైఎస్సార్ సీపీ నాయకులు నంబూరు బాబురావు, ఆళ్ల శ్రీనివాసరెడ్డి, చిలకా సాంబయ్య, పసుపులేటి శ్రీనివాసరావు, గ్రామ ఉపసర్పంచి గుబ్బా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వైభవంగా మల్లేశ్వరస్వామి దేవస్థానం వార్షికోత్సవం



మల్లేశ్వరస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు చేస్తున్న నంబూరు వసంతకుమారి

ఎర్రబాలెం(క్రోసూరు): మండలంలోని ఎర్రబాలెం గ్రామంలో బుధవారం భ్రమరాంబదేవీ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానం ప్రథమ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, నందీశ్వరుడు, వాయులింగ విగ్రహాల ప్రతిష్టా మహోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సతీమణి నంబూరు వసంతకుమారి పాల్గొని ప్రత్యేక పూజలు చేసారు.అ నంతరం భక్తులకు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ గ్రామ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

పెండింగ్ అర్జీలు లేకుండా పనిచేయండి

ముప్పాళ్ళ: గ్రామసచివాలయాల్లో పెండింగ్ అర్జీలు లేకుండా పనితీరు మెరుగుపరచుకోవాలని తహసీల్దార్ ఎమ్.భవానిశంకర్ చెప్పారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రీసర్వే, సచివాలయ సేవలు పై వీఆర్వోలు, సర్వేయర్‌లు, సచివాలయ సిబ్బందితో బుధవారం సమావేశం నిర్వహించారు. సమావేశంలో తహసీల్దార్ మాట్లాడుతూ పట్టాదారు పాసుపుస్తకాలతో పాటుగా సచివాలయం ద్వారా అన్ని రకాల సేవలను సకాలంలో అందించాలన్నారు. గ్రామాల్లో జరుగుతున్న రీసర్వే ప్రక్రియను మరింత వేగవంతం చేయాలన్నారు. ఇప్పటికి 35% మాత్రమే పూర్తయిందన్నారు. రోజుకు 100 ఎకరాలు చొప్పున అన్ని గ్రామాల్లోను సర్వే పూర్తి చేయాలన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్‌లక్ష్మీప్రసాదు, మండల సర్వేయర్ ఏడుకొండలు, ఆయా గ్రామాల వీఆర్వోలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

నీటి కుళాయి వద్ద ఘర్షణ.. ఒకరికి గాయాలు

క్రోసూరు: మండలంలోని నాగవరం గ్రామంలో నీటి కుళాయి వద్ద మాటమాట పెరిగి ఘర్షణ చోటు చేసుకున్న సంఘటనలో ఒకరికి గాయాలై సత్తెనపల్లి ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు ఎస్‌ఐ సీహెచ్ మణికృష్ణ బుధవారం తెలిపారు. ఆసుపత్రి నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు తెలిపారు. ఫిర్యాది వల్లాల కోటేశ్వరమ్మ తెలిపిన వివరాల మేరకు కోటేశ్వరమ్మ కుమారుడు, అదేగ్రామానికి చెందిన తోకల వెంకటశివ కుమారుడు ఇద్దరూ నీటి కుళాయి వద్ద మంగళవారం రాత్రి గొడవ పడ్డారు. దీనిపై నిలదీసిన కోటేశ్వరమ్మను, ఆమె భర్త ఆంజనేయులను తోకల వెంకటశివ మరికొందరు దుర్భాషలాడటమేకాక ఆమె భర్తపై దాడి చేసి కొట్టారని ఫిర్యాదులో తెలిపింది. గాయలైన తన భర్త ఆంజనేయులను ఆసుపత్రిలో చేరి్పంచినట్లు తెలిపిందన్నారు.

సత్తెనపల్లిలో చైన్ స్నాచింగ్

సత్తెనపల్లి: మహిళ మెడలోని చైన్ స్నాచింగ్ జరిగిన ఘటన పట్టణంలోని నాగార్జున నగర్‌లో మంగళవారం రాత్రి జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని నాగార్జున నగర్‌కు చెందిన చేకూరి సునీత మగ్గం పనులు, కుట్టు మిషన్ పనులు చేవడుతుంటుంది. ఆమె ప్రధాన రహదారి నుంచి పనులు ముగించుకుని తిరిగి ఇంటికి వచ్చి ఇంటిమెట్లెక్కే సమయంలో గుర్తు తెలియని దుండగుడు ఆమె మెడలోని మూడు సెవర్ల నాన్తాడు బంగారు గొలుసు లాక్కొని పరారయ్యాడు. అదే సమయంలో మరో యువకుడు కనిపించడంతో ఆమె అతనికి చెప్పి వాపోయింది. ఆ యువకుడు ముందుకు వెళ్లి ఆ దుండగుడితో కలిసి ద్విచక్ర వాహనంపై పరారయ్యారు. చోరీ ఘటన పై బాధిత మహిళ పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి దుండగుల కోసం గాలిస్తున్నారు.

గృహసారథులే వైఎస్సార్ సీపీ రథసారథులు

- చిత్తశుద్ధితో కలిసికట్టుగా పనిచేయండి అధికారం మళ్లీ మనదే
- సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులు సమన్వయంతో పని చేయాలి
- మంత్రి అంబటి రాంబాబు



మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు, వేదికపై పరిశీలకుడు హనుమారెడ్డి

సత్తెనపల్లి: సచివాలయ సమన్వయకర్తలు, గృహసారథులు సమిష్టిగా చిత్తశుద్ధితో పనిచేస్తే అధికారం మళ్లీ మనదేనని, కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు గుర్తింపు, న్యాయం జరుగుతుందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో ముప్పాళ్ళ మండల సచివాలయ కన్వీనర్లు, గృహసారథుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ ఇప్పటి నుంచే ఎన్నికలకు సిద్ధమయ్యేందుకు, పార్టీ పరిపుష్టికి గృహసారథులు, సచివాలయ కన్వీనర్ల వ్యవస్థను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రూపొందించారన్నారు. కన్వీనర్లు వలంటీర్లపై పెత్తనం చేయకుండా గృహ సారథులతో కలిసి పార్టీని బలోపేతం చేయాలని, ప్రభుత్వ పథకాలు క్షేత్ర స్థాయికి అందేలా చూడాల్సిన బాధ్యత మీపైనే ఉందన్నారు. ప్రభుత్వ పనితీరు, సంక్షేమ పథకాలపై అత్యధిక మంది ప్రజలు సంతృప్తిగా ఉన్నారన్నారు. జగనన్న సచివాలయాల మండల ఇన్‌చార్జులు, సచివాలయాల కన్వీనర్లు ఈ వ్యవస్థలో కీలకమన్నారు. ప్రభుత్వం పారదర్శకంగా సంక్షేమం అందిస్తోందని, నియోజకవర్గంలోనూ మీరు గర్వంగా చెప్పుకునేలా పరిపాలన అందిస్తున్నామన్నారు. గత పాలకుల్లాగా దౌర్జన్యపూరితంగా వ్యవహరించడం లేదని ఇలాంటి వాస్తవాలు తెలుసుకుని ప్రజలకు తెలియ చెప్పాల్సిన బాధ్యత మీపై ఉందన్నారు. ప్రతిపక్ష పార్టీలో ముఖ్యంగా జనసేన నాయకులు ప్రతిరోజు తనను ఏదో విధంగా తిడుతూనే ఉంటారని .. వాళ్ల తిట్లు, ఆరోపణలే నాకు ఆశీర్వచనాలన్నారు. నియోజకవర్గంలో తెలిసి తప్పు చేయనని స్పష్టం చేశారు. వైఎస్సార్ సీపీ పైన ఈగ వాలినా మొట్టమొదటిగా స్పందించేది అంబటి రాంబాబు అని అందుకే తనను రాష్ట్రవ్యాప్తంగా ప్రతిపక్ష పార్టీలు లక్ష్యంగా చేసుకుని దురుద్దేశం పూరితంగా వ్యవహరిస్తున్నాయన్నారు. సత్తెనపల్లి నియోజకవర్గ పరిశీలకులు వెన్నా హనుమా రెడ్డి మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది కన్వీనర్లు, గృహసారథులను సమన్వయం చేసుకుంటూ ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థ దేశంలోని అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందన్నారు. భవిష్యత్తులోనూ ఇదే ఒరవడిని కొనసాగించాలని కోరారు. గృహసారథుల వల్ల వలంటీర్ల విధులకు ఏమాత్రం ఆటకం ఉండదని, వలంటీర్లకు ఇచ్చే గౌరవం, ప్రాధాన్యం ఏమాత్రం తగ్గదని, ప్రతిపక్షాలు సృష్టించే అపోహలను నమ్మవద్దని సూచించారు. ప్రజలకు మరిన్ని మెరుగైన సేవలు అందించేందుకు కొత్తగా వీరిని నియమించారన్నారు. వలంటీర్లు, సచివాలయ వ్యవస్థ ప్రభుత్వానికి రెండు కళ్ళని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి వలంటీర్లపై ప్రత్యేక అభిమానం ఉందన్నారు. కోవిడ్ సమయంలో వారు చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. కన్వీనర్లు, గృహసారథుల నియామకంతో వలంటీర్ల సేవలకు ఎటువంటి ఆటంకం ఉండదని స్పష్టం చేశారు. సమావేశంలో ముప్పాళ్ళ మండల నాయకులు ఎంజిఆర్ లింగారెడ్డి, సిరిగిరి గోపాలరావు, నక్కా శ్రీనివాసరావు, జేసిఎస్ మండల ఇన్‌చార్జి రెండెద్దుల వెంకటేశ్వర రెడ్డి, పలు గ్రామాల సర్పంచ్‌లు,ఎంపీటీసీలు, మండల నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

కోలుకుంటున్న గురుకులం విద్యార్థినులు

- 170 మంది కోలుకొని క్షేమంగా ఇంటికి పయనం
- గుంటూరులో ఆరుగురు, సత్తెనపల్లిలో 30 మందికి వైద్య సేవలు
- వైద్య సేవలు పొందుతున్న విద్యార్థినుల ఆరోగ్యం నిలకడ



వైద్యశాలలో సిబ్బందికి సూచనలు చేస్తున్న ఆర్ఎంఓ శోభారాణి,అభివృద్ధి కమిటీ సభ్యుడు కొత్తా రామకృష్ణ

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం రామకృష్ణాపురంలోని బీఆర్ అంబేడ్కర్ ఏపీ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో ఆహారం కలుషితం కారణంగా విద్యార్థినులు అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. మొత్తం 206 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురి కావడంతో రాష్ట్ర జలవనుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ఆదేశాల మేరకు పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ నేతృత్వంలో యంత్రాంగం హుటాహుటిను స్పందించి సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు విద్యార్థినులను తరలించి మెరుగైన చికిత్స అందించారు. బుధవారం నాటికి మొత్తం 206 మంది విద్యార్థినిలకు గాను 170 మంది అనారోగ్యం నుంచి కోలుకొని క్షేమంగా ఇంటి బాట పట్టారు. గుంటూరు వైద్యశాలలో ఆరుగురు, సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో 30 మంది వైద్య సేవలు పొందుతున్నారు. మొత్తం మూడు బ్లాక్‌లో వైద్య సేవలు అందిస్తున్నారు. ఈ విద్యార్థినుల ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు వైద్యులు నిర్ధారించారు. ఏరియా వైద్యశాలలో విద్యార్థినులు ఆరోగ్యాన్ని ఆర్ఎంఓ డాక్టర్ శోభారాణి పర్యవేక్షిస్తూ సూచనలు అందించారు. విద్యార్థినులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా మూడు బ్లాకుల వద్ద పర్యవేక్షణ నిమిత్తం గ్రామ రెవెన్యూ అధికారులకు విధులు కేటాయించారు. విద్యార్థినులు కోలుకోవడంతో తల్లిదండ్రుల్లో ఆందోళన తగ్గి ఊపిరి పీల్చుకుంటున్నారు. ఇదిలా ఉంటే రామకృష్ణాపురంలోని గురుకుల పాఠశాలను ఏఎమ్ఓ సంజీవరావు, డీసీఓ శాంతి విశాల బుధవారం సందర్శించి ఆర్వో ప్లాంట్‌ను పూర్తి స్థాయిలో మరమ్మతులు చేయిస్తున్నారు. డ్రైనేజీ సిస్టమ్ శుభ్రపరిచేందుకు చర్యలు చేపడుతున్నారు. అంతేగాక గురుకుల పాఠశాల, కళాశాలలోని డైనింగ్‌హాల్ శుభ్రం చేయించి ఆ ప్రాంతంలోని జంగిల్ క్లియరెన్స్ చేయించారు. రామకృష్ణాపురంలోని బీఆర్ అంబేడ్కర్ ఏపీ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపల్‌గా కెఎస్‌వి.స్వర్ణకుమారి భాద్యతలు చేపట్టారు.అచ్చంపేట బాలుర గురుకులం నుంచి బదిలీ పై ఆమె ఇక్కడకు వచ్చారు.

డాక్టర్ ముని భవానికి సత్కారం



డాక్టర్ ముని భవానిని సత్కరిస్తున్న రామకృష్ణ, డాక్టర్ వెంకట్రావు, డాక్టర్ శోభారాణి

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం రామకృష్ణాపురంలోని బీఆర్ అంబేడ్కర్ ఏపీ సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో కలుషిత ఆహారం కారణంగా విద్యార్థినులు అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. వారికి వైద్యసేవలు అందించేందుకు డీసీహెచ్ డాక్టర్ రంగారావు ఆదేశాల మేరకు చిలకలూరిపేట గవర్నమెంట్ హాస్పిటల్ విధులు నిర్వహించే డాక్టర్ భవాని సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో సేవలు అందించింది. ఆమె అందించిన ఉత్తమ సేవలకు హాస్పటల్ అభివృద్ధి కమిటీ సభ్యుడు కొత్త రామకృష్ణ ఆధ్వర్యంలో బుధవారం పూలమాలలు, దుశ్శాలువాలతో చిరు సత్కారం చేశారు. కార్యక్రమంలో సూపరిండెంట్ డాక్టర్ వెంకట్రావు, ఆర్ఎంఓ శోభ రాణి, కమిటీ సభ్యులు, ఉన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థికసాయం

అచ్చంపేట: గుండెపోటుతో అచ్చంపేట, ఎస్సీ కాలనీకి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త కొత్తపల్లి రాజు (36) బుధవారం మృతి చెందగా, తక్షణ సహాయంగా వారి కుటుంబానికి వైఎస్సార్ సీపీ నాయకులు రూ.10వేలు ఆర్థిసహాయం చేశారు. మృతుడికి ఇద్దరు ఆడ పిల్లలు, ఒక మగసంతానం. వీరితోపాటు తల్లిదండ్రులు కూడా మృతుడు రాజుపైనే ఆధారపడి జీవిస్తున్నారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చిల్కా చంద్రయ్య, ఎస్సీ నాయకులు సందెపోగు పున్నారావు, సంసోను, ఉప ఎంపీపీ గంగసాని బాబు, గ్రామ సర్పంచి కంబాల వీర బాబు తదితరులు మృతదేహాన్ని సందర్శించి వారి కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలిపారు. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పంపిన రూ.10వేల నగదును తక్షణ సహాయంగా మృతుని కుటుంబానికి అందచేశారు.

అధికారులపై చర్యలు తీసుకోవాలి

నరసరావుపేట: తన భర్త మృతికి కారకులైన కెనరా బ్యాంకు అధికారులపై చర్యలు తీసుకోవాలని అమరా ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ అమరా వెంకటేశ్వరరావు భార్య సుధారాణి జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాదును కోరారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్‌లో ఆర్యవైశ్య నాయకులతో కలిసి వినతిపత్రం సమర్పించారు. అమరా వెంకటేశ్వరరావు పురుగుమందు సేవించి ఆత్మహత్యకు పాల్పడిన విషయం విదితమే. బ్యాంకు అధికారులు ఒత్తిడి వలనే తన భర్త మానసిక వేదనకు గురై మృతిచెందాడని ఆమె పేర్కొన్నారు. బ్యాంకు భవనాలను బ్యాంకులో తాకట్టు పెట్టుకొని లోపలి వస్తువులు, విద్యార్థులు సర్టిఫికెట్లు అన్నింటిని కలిపి సీజ్ చేసి వేధించారన్నారు. ఆమెతో పాటు వెంకటేశ్వరరావు, శ్రీనివాస గుప్తా పాల్గొన్నారు.

ఆటోమొబైల్ దుకాణంలో అగ్నిప్రమాదం



మంటలు అదుపు చేస్తున్న అగ్ని మాపక సిబ్బంది

సత్తెనపల్లి: ఆటోమొబైల్ దుకాణంలో అగ్నిప్రమాదం జరిగిన సంఘటన పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణంలోని ఎన్జీఓ హోం సెంటర్లో బుధవారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని ఎన్జీవో హోం సెంటర్లో గల శ్రీ వైష్ణవి ఆటోమొబైల్ దుకాణంలో విద్యుత్తు షార్ట్ సర్క్యూట్ కారణంగా ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దుకాణంలో ద్విచక్ర వాహనాలకు సంబంధించిన స్పేర్ పార్టులు పూర్తిగా దహనమ య్యాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేసేందుకు యత్నించారు. సుమారు రూ.10 లక్షలకు పైగా ఆస్తి నష్టం జరిగినట్లు అంచనా. వస్తువులన్నీ కాలిపోవడంతో దుకాణ యజమాని గాంధీ ఆవేదన వ్యక్తపరిచాడు.

నియోజకవర్గ సర్పంచ్‌ల ప్రతినిధిగా వెంకటసుబ్బమ్మ



అనుపాలెం సర్పంచ్‌ని అభినందిస్తున్న మంత్రి బుడిద ముత్యాలనాయుడు

రాజుపాలెం: మండలంలోని అనుపాలెం సర్పంచ్ సానికొమ్ము వెంకటసుబ్బమ్మ శ్రీనివాసరెడ్డిని సత్తెనపల్లి నియోజకవర్గ పంచాయతీల సర్పంచ్‌ల ప్రతినిధిగా తనను ఎంపిక చేసినందుకు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. దీనికి గాను బుధవారం తాడేపల్లిలోని వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో రాష్ట్ర స్థాయి సర్పంచ్‌ల సదస్సుకు హాజరైనట్లు ఆమె తెలిపారు. ఈ సదస్సులో నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులను, సర్పంచ్‌లు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించినట్లు ఆమె తెలిపారు. రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి బుడిద ముత్యాలనాయుడు తనను అభినందించినట్లు తెలిపారు. నియోజకవర్గంలో సర్పంచ్‌ల ద్వారా జరుగుతున్న అభివృద్ధి పనులు, వారి సమస్యలను ఎప్పటికప్పుడు తమ దృష్టికి తేవాలని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి పేర్కొన్నారు. ప్రతినిధిగా ఎన్నికైన వెంకటసుబ్బమ్మ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో సర్పంచ్‌ల సమస్యలను ప్రభుత్వం, అధికారుల దృష్టికి తీసుకెళతానని తెలిపారు.

బ్రాహ్మణపల్లిలో పర్యటించిన టుబాకో బోర్డు డైరెక్టర్

బర్లీ పొగాకు సాగు పరిశీలన



యంత్ర పరికరాల గురించి అడిగి తెలుసుకుంటున్న అశ్విని నాయుడు

వినుకొండ(నూజెండ్ల): వినుకొండ మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామం వద్ద పొగాకు క్షేత్రాన్ని గుంటూరు టుబాకో బోర్డు డైరెక్టర్ అశ్విని నాయుడు, జీపీఐ కంపెనీ ప్రతినిధులు సంయుక్తంగా పరిశీంచారు. బర్లీ పొగాకు సాగు చేయు ప్రాంతాన్ని సందర్శించి జీపీఐ కంపెనీ వారు చేపట్టిన ఐపీఎస్ సిస్టమ్ గురించి, చేపట్టిన యాంత్రీకరణ అభివృద్ధి, సాగు పద్ధతుల గురించి ఆమె వివరాలు అడిగితెలుసుకున్నారు. జీపీఐ రైతులు పాటిస్తున్న సుస్థిరమైన పొగాకు సాగు పద్ధతులను ప్రశంసించారు. ఈ సందర్భంగా జీపీఐ వైస్ ప్రెసిడెంట్ జితేంద్రకుమార్ మాట్లాడుతూ జీపీఐ కంపెనీ అన్ని విధాలుగా రైతులకు మేలైన పంట సాగు పద్ధతులపై అవగాహన కల్పిస్తూ పంట అభివృద్ధికి సహకారం అందిస్తామని తెలిపారు. అలాగే జీపీఐ జనరల్ మేనేజర్ ఎం.ప్రభాకరరావు మాట్లాడుతూ అశ్విని నాయుడు జీపీఐ కంపెనీ రైతుల పొలాలు సందర్శించడం అభినందనీయమని, రైతులకు మంచి రేట్లు అందించి వారి సాగు లాభదాయకంగా ఉండేలా చూసుకుంటామని తెలియజేశారు. కార్యక్రమంలో జీపీఐ మేనేజర్ పునీత్, వీరారెడ్డి, కోటేశ్వరరావు, వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు



పురుగుమందుల దుకాణాలు తనిఖీచేస్తున్న సహాయ వ్యవసాయ సంచాలకులు

నకరికల్లు : ఎరువులు, పురుగు మందులను ఎమ్మార్పీ ధరల కన్నా ఎక్కువ ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సహాయ వ్యవసాయ సంచాలకులు బి.శ్రీకృష్ణదేవరాయలు హెచ్చరించారు. మండలంలోని గుండ్లపల్లి, నకరికల్లు గ్రామాల్లోని ఎరువులు, పురుగుమందుల దుకాణాల్లో బుధవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిల్వలు నాణ్యతా ప్రమాణాలకు లోబడి ఉండాలన్నారు. విక్రయించిన సరుకుకు రశీదులు ఖచ్చితంగా రైతులకు ఇవ్వాలని అన్నారు. రికార్డులు తనిఖీ చేశారు. పలుమందుల నమూనాలు సేకరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

సాహిత్య సంపదను అందించిన విశ్వనరుడు జాషువా

మంత్రి అంబటి రాంబాబు



విశ్వనరుడు గుర్రం జాషువా డైరీని ఆవిష్కరిస్తున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: కవిత్వమనే ఆయుధంతో కట్టుబాట్లను, దుర్నీతిని ప్రతిఘటించి అద్భుతమైన సాహిత్య సంపదను సమాజానికి అందించి విశ్వనరుడు గుర్రం జాషువా అని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో కవికోకిల శ్రీ గుర్రం జాషువా సాహితీ సేవా సంస్థ వారి నూతన సంవత్సరం -2023 డైరీని బుధవారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ ఆనాటి సమాజ పరిస్థితుల్లో అంటరాని తనమనే భయంకరమైన వ్యాధి వల్లన ఎన్నో అవమానాలను, ఛీత్కారాలను జాషువా ఎదుర్కొన్నాడన్నారు. దుర్భరమైన దారిద్ర్యం బాధించినా, అంటరానితనం వేధించినా జాషువా జీవితంతో రాజీపడి, పరిస్థితులకు లొంగిపోయి బ్రతకలేదన్నారు. ఈ సందర్భంగా పల్నాడు జిల్లాను గుర్రం జాషువా పల్నాడు జిల్లాగా మార్చవలసినదిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్ళవలసినదిగా సంస్థ సభ్యులు మంత్రి అంబటి రాంబాబుకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సంస్థ బాధ్యులు, అధ్యక్షుడు యిర్మీయా, ఏఎన్నార్ జక్కం, సురేష్, అనిల్, ప్రశాంతరాజు, జాన్ బాబు, కోటేశ్వర రావు, జయకుమార్, ప్రేమ్ కుమార్, మార్క్ బాబు, కౌన్సిలర్ అచ్యుత శివప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకులు చుక్కా మోషే, కోడిరెక్క దేవదాస్, బచ్చు మనోహర్, వెలుగూరి శరత్ బాబు, శివాపురం రామారావు,రేపూడి రవితేజా, గుంటూరు ఆశీ ర్వాదం, వల్లెం నరిసింహరావు, తదితరులు ఉన్నారు.

రామలింగేశ్వరస్వామి దేవాలయంలో చోరీ



చోరీ జరిగిన రామలింగేశ్వరస్వామివారి దేవాలయం

అచ్చంపేట: మండలంలోని కోగంటివారిపాలెంలో గల రామలింగేశ్వరస్వామివారి దేవాలయంలో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడి అమ్మవారి వంగారు పుస్తెలు, వడ్డాణం తదితర నగలు అపహరించిన ఘటన బుధవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. గ్రామంలో కూడా పలుచోట్ల చోరీకి పాల్పడి గ్యాస్ సిలెండర్లు, ఫ్రిజ్‌లు ఆటోలో వేసుకుని వెళ్లినట్లు తెలిసింది. వివరాలు ఇలా ఉన్నాయి. రామలింగేశ్వరస్వామి వారి దేవాలయంలో అమ్మవారికి భక్తులు సమర్పించిన అమ్మవారి బంగారు పుస్తెలు, బంగారు కోటింగ్ వేసిన వెండి వడ్రాణ్ణం, ఇత్తడి వస్తువులు అపహరణకు గురయ్యాయి. వీటి విలువ సుమారు రూ.70వేలకు పైగా ఉంటుందని ఆలయ పూజారి చింతలపాటి సూర్యనారాయణశాస్త్రి తెలిపారు. రోజూ లాగానే ఆలయాన్ని శుభ్రపరచేందుకు పనిమనిషి బుధవారం ఉదయాన్నే వెళ్లగా దేవాలయం తలుపులు తెరచి ఉన్నాయి. ఇంత పొద్దున్నే పూజారి వచ్చారేంటా అని చూచేసరికి పూజారి లేకపోగా దేవాలయంలో ఉండే ఇత్తడి వస్తువులు, అమ్మవారికి అలంకరించిన వడ్రాణ్ణం లేకపోవడంతో అనుమానం వచ్చి వెంటనే పూజారికి సమాచారం అందచేసింది. గ్రామ పెద్దలను తీసుకుని పూజారి వచ్చి చూడగా అమ్మవారి బంగారు పుస్తెలు, వడ్రాణ్ణం, నాలుగు కిలోల ఇత్తడి వస్తువులు కనిపించలేదు. వెంటనే గ్రామస్తుల సహాయంతో అచ్చంపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇదే గ్రామంలో కూల్‌డ్రింక్ షాపు నడిపే యారం సాంబిరెడ్డి షాపులోని ఫ్రిజ్, మూడు గ్యాస్ సిలెండర్లు కూడా అపహరణకు గురయ్యాయి. పక్క గ్రామం చిగురుపాడులో రోడ్డు పక్కనే హోటల్ నడుపుకొనే కాశియ్య హోటల్‌లో కూడా ఫ్రిజ్ మాయమయ్యింది. దుండుగులు అర్ధరాత్రి సమయంలో ఎవరూ లేకుండా చూచి రోడ్డుపక్కనే ఉన్న హోటల్స్, షాపులలో ఫ్రిజ్‌లు, గ్యాస్ సిలెండర్స్ ఆటోలో వేసుకుని పరారయినట్లు భావిస్తున్నారు. అచ్చంపేట ఎస్ఐ కె.పాల్ రవీంద్ర కేసు నమోదు చేసుకుని, గుంటూరు నుంచి క్లూస్ టీమును రప్పించి, దర్యాప్తు చేస్తున్నారు.

ఆలయం హుండీ చోరీ



చోరీకి గురైన స్వామి ఆలయం హుండీ

నకరికల్లు : స్థానిక కొండపై గల శ్రీలక్ష్మీ నర్సింహస్వామి ఆలయం హుండీలోని నగదు చోరీకి గురైంది. ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నకరికల్లులోని శివాపురం తండా రోడ్డులో గల కొండపై శ్రీఆదిలక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మినర్సింహస్వామి ఆలయం ఉంది. ఆలయపూజారి మంగళవారం సాయంత్రం 7గంటల తర్వాత పూజాధికాలు ముగించుకుని తాళాలు వేసి వెళ్లాడు. తిరిగి బుధవారం ఉదయం పూజలు చేసేందుకు ఆలయానికి వెళ్లేసరికి ప్రధానగేటు తాళాలు, హుండీతాళాలు పగులగొట్టినట్లు గుర్తించాడు. దీంతో ఆలయ ఈఓ వెంకయ్యకు పూజారి పాండురంగాచార్యులు సమాచారం అందించారు. ఆలయానికి చేరుకున్న ఈఓ వివరాలు సేకరించారు. ఆలయంలోని సీసీ కెమెరా ధ్వంసం చేసిన గుర్తుతెలియని దుండగులు సీసీ కెమెరా పరికరాలు, హుండీలోని సుమారు రూ.4వేల నగదును అపహరించినట్లు గుర్తించారు. పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పి.సురేష్ తెలిపారు.

చికిత్స పొందుతున్న రోగికి పింఛన్ పంపిణీ



గుంటూరు జీజీహెచ్‌లో రామయోగి బయోమెట్రిక్ వేయిస్తున్న వలంటీర్ త్రివేణి



జీజీహెచ్‌లో వృద్ధురాలు జెట్టి వజ్రంకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ సిద్ధూ

సత్తెనపల్లి: పట్టణంలోని 19వ వార్డ్ కొత్తపేటలో నివాసం ఉంటున్న కంచు రామయోగి అనే వృద్ధుడు గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ గుంటూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అనారోగ్యంతో వైద్యశాలలో ఉన్న ఆ పేదవాడికి వచ్చే పింఛన్ అందచేయాలనే తాపత్రయంతో ఆ వార్డు మహిళా వలంటీర్ యాసారపు త్రివేణి బుధవారం గుంటూరు జీజీహెచ్‌కు వెళ్లి బయోమెట్రిక్ వేయించి ఎప్పటిలా ప్రతి నెల మొదటి తేదీ రాగానే ప్రభుత్వం అందించే పింఛన్ రూ.2,750ను అందించింది. ఎక్కడో దూరంగా వైద్యశాలలో చికిత్స పొందుతున్నప్పటికీ ప్రభుత్వం అందించే పింఛన్ తన వద్దకు వచ్చి అందించిన వలంటీర్ త్రివేణికి రామయోగి కృతజ్ఞతలు తెలిపాడు. ఈ ప్రభుత్వం ఎల్లప్పుడూ అధికారంలో ఉండాలని ఆయన ఆకాంక్షించాడు.

జీజీహెచ్‌కు వెళ్లి వృద్ధురాలికి పింఛన్ అందజేత

అమరావతి: రోడ్డు ప్రమాదంలో కాలికి తీవ్రగాయమై గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో రెండు నెలలుగా చికిత్స పొందుతున్న 90 ఏళ్ల వృద్ధురాలికి వలంటీర్ ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేశాడు. మండల పరిధిలోని జూపూడి గ్రామానికి చెందిన జెట్టి వజ్రం అనే వృద్ధురాలికి సుమారు 45కిలోమీటర్లు దూరం వెళ్లి ఆమెకు రావాల్సిన రెండు నెలల పింఛన్‌ను గ్రామ వలంటీర్ సిద్ధూ అందజేశాడు. సిద్ధూకు జెట్టి వజ్రం కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈసందర్భంగా సిద్ధూను గ్రామసర్పంచి కాశి మాల పేరయ్య, ఎంపీటీసీ దేవకుమార్, వైఎస్సార్ సీపీ నాయకుడు అన్నపాములు అభినందించారు.

లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ

నకరికల్లు : ప్రభుత్వం అందజేస్తున్న పింఛన్లు పేదలకు అండగా నిలుస్తున్నాయని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి అన్నారు. మండలంలోని జిల్లాపేటతండా, పలుగ్రామాల్లో బుధవారం పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతినెలా రూ. 2,750ల పింఛన్‌ను ఒకటో తేదీ ఉదయాన్నే అందించి చేదోడువాదోడుగా నిలుస్తున్న ప్రభుత్వం జగనన్న ప్రభుత్వమని కొనియాడారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు మేడం ప్రవీణ్‌కుమార్ రెడ్డి, దూదేకుల హుస్సేన్‌బీ బాషా, దుర్గా నాయక్, అవుదూరి అంజిరెడ్డి, మద్దం సురేష్ తదితరులు పాల్గొన్నారు.



పింఛన్లు పంపిణీ చేస్తున్న మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి